క్లుప్తంగా

ఉపాధ్యాయుడిపై దాడి అమానుషం



గద్వాల రూరల్: నిజామాబాదు జిల్లాలో కోటగిరిలో ఉపాధ్యాయుడు మల్లికార్జున్‌పై కొందరు దుండగులు దాడి చేయటాన్ని జిల్లా ఉపాధ్యాయుల హక్కుల సంఘం నాయకులు ఖండించారు. సోమవారం ఆ సంఘం ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ అపూర్వ్‌చౌహాన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. పాఠశాలలో విద్యార్థులకు శాస్త్రీయత గురించి వివరిస్తూ మూఢనమ్మకాలు, విశ్వాసాలను పారద్రోలేలా చైతన్యం చేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో టీచర్లు మోహన్, ఎక్బాల్‌పాషా, హనుమంతు, నాగరాజు, దానయ్య, ఇమ్మానియేల్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

13 నుంచి శివాంజనేయ స్వామి ఉత్సవాలు

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని వావిలాలలో ఈ నెల 13వ తేదీ నుంచి 17 వరకు శివాంజనేయస్వామి ఉత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సవాలలో భాగంగా ఆలయంలో 13న ధ్వజారోహణం, 14న ఉపనయనసేవ, 15న అభిషేకం, రథోత్సవం, 16న పలకీసేవ, 17న స్వామి వారి జలక్రీడలతో ఉత్సవాలు ముగుస్తాయని పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై ఉత్సవాలను విజయవంతం చేయాలని వారు కోరారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



అయిజ: మండలంలోని ఉత్తనూరులో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సోమవారం విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. రాష్ట్రీయ బాల స్వస్థీయ కార్యక్రమంలో భాగంగా పరీక్షలు నిర్వహిస్తున్నట్లు డాక్టర్ రాఘవేంద్ర తెలిపారు. అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. జోగుళాంబ గద్వాల జిల్లాలో మొత్తం నాలుగు టీంలు పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్య బృందం, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

శివాలయంలో ప్రత్యేక అభిషేకాలు

ఎర్రవల్లిచౌరస్తా: బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని శివాలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక అభిషేకాలను నిర్వహించారు. ఈ సందర్భంగా చుట్టు పక్కల ప్రాంతాల నుంచి భక్తులు, శివ మాల ధరించిన స్వాములు బీచుపల్లికి చేరుకొని పవిత్ర కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం భక్తిశ్రద్ధలతో శివాలయాన్ని దర్శించుకొని శివలింగానికి ప్రత్యేక పూజలను నిర్వహించి మొక్కులను తీర్చుకున్నారు.

రేపటి నుంచి అధ్యయనోత్సవాలు

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలం బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని కోదండరామస్వామి ఆలయంలో ధనుర్మాస మహోత్సవాలలో భాగంగా ఈనెల 11వ తేదీ నుంచి 14 వరకు అధ్యయనోత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ మేనేజర్ సురేందర్ రాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సవాలలో భాగంగా 14న గోదా రంగనాథస్వామి కల్యాణాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి వారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

అనాథ పిల్లలకు ఆర్థికసాయం



ఉండవెల్లి: మండలంలోని కంచుపాడులో తల్లిదండ్రులు మరణించిన అనాథ పిల్లలకు పూర్వ విద్యార్థులు రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. అయిజ మండలం యాపదిన్నె పాఠశాలలో 2012వ సంవత్సరంలో పదవ తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు అనాథలకు అండగా నిలిచారు. చిన్నారులకు అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో చరణ్, డాకేష్, నాయుడు పాల్గొన్నారు.

క్రీడాకారులకు బంగారు భవిష్యత్



అయిజలో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంపీపీ నాగేశ్వర్‌రెడ్డి



కేటీదొడ్డిలో చింతలకుంటలో బహుమతులు అందజేస్తున్న ఎస్‌ఐ వెంకటేశ్



ధరూరులో విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి

అయిజ: క్రీడాకారులకు బంగారు భవిష్యత్ ఉంటుందని ఎంపీపీ నాగేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం సంక్రాంతి పండుగ సందర్భంగా పట్టణంలోని తిక్క వీరేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న ప్రీమియర్ లీగ్ సీజన్ 7వ క్రీడా పోటీలను ఆయన తిలకించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ క్రీడలతో శారీరక, మానసిక ఆరోగ్యం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో క్రీడాకారులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

బహుమతులు అందజేత

కేటీదొడ్డి: మండలంలోని చింతలకుంటలో స్వామి వివేకానంద జయంతి పురస్కరించుకొని ఏర్పాటు చేసిన వాలీబాల్ టోర్నమెంట్ సోమవారం ముగిసింది. విజేతలకు ఎస్‌ఐ వెంకటేష్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచు సువర్ణమ్మ, ఉప సర్పంచు, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వాలీబాల్ టోర్నీ

అలంపూర్: ఈ నెల 12వ తేదీన జాతీయ యువజన దినోత్సవం, స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని పట్టణంలోని మాంటిస్సోరి పాఠశాల ఆవరణలో కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా నిర్వహించిన వాలీబాల్ టోర్నీ సోమవారం ముగిసింది. విజేతగా చైతన్య యువజన సంఘం నిలిచింది. ద్వితీయ బహుమతి అలంపూర్ యూత్ సంఘం గెలుపొందింది. కార్యక్రమంలో ఎస్‌ఐ శ్రీహరి, పీఈటీ మాధవరావు, దాత వెంకట్రామయ్య శెట్టి, వివేకానంద యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

ధరూరు: క్రీడల్లో మానసికోల్లాసం కలుగుతుందని ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి అన్నారు. జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం మండల కేంద్రంలో వాలీబాల్, 100 మీటర్ల పరుగు పందెం పోటీలు నిర్వహించారు. వాలీబాల్ పోటీల్లో అల్వలపాడు గ్రామానికి చెందిన యువకులు మొదటి స్థానంలో నిలిచారు. రెండో బహుమతిని ధరూరు టీం గెలుపొందింది. అలాగే 100 మీటర్ల పరుగు పందెం పోటీలలో అల్వలపాడు యువకులు మొదటి, రెండవ బహుమతులను గెలుచుకున్నారు. అనంతరం ఎస్‌ఐ మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడల్లోనూ యువత రాణించాలని సూచించారు. అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎం ప్రతాప్‌రెడ్డి, పీఈటీలు శ్రీనివాసులు, బీసన్న, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యం



మల్దకల్‌లో గర్భిణులకు న్యూట్రిషన్ కిట్లను అందజేస్తున్న డాక్టర్ స్వరూపరాణి



మానవపాడు ఆరోగ్య కేంద్రంలో న్యూట్రిషన్ కిట్లను అందిస్తున్న డాక్టర్ రిజ్వానా తాన్విర్

మల్దకల్: రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించి వారి ఆరోగ్యంపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు డాక్టర్ స్వరూపరాణి తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన గర్భిణీ, బాలింతలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. డిసెంబరు మాసంలో 31 ప్రసవాలు జరిగాయని, ఈ వారం రోజుల్లో ఏడు సాధారణ ప్రసవాలు చేసినట్లు ఆమె పేర్కొన్నారు. అలాగే గర్భిణులకు డిసెంబరులో 120 న్యూట్రిషన్ కిట్లు, ఈ నెలలో 40 కిట్లు అందించి వాటిని ఎలా వినియోగించుకోవాలో వారికి అవగాహన కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శ్రీధర్, వెంకటస్వామి, మునెమ్మ, పుష్పలేఖ, మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

న్యూట్రిషన్ కిట్లు అందజేత

మానవపాడు: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో న్యూట్రిషన్ కిట్లను సోమవారం డాక్టర్ రిజ్వానా తాన్విర్ అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. గర్భిణులలో రక్తహీనతను తగ్గించడానికి న్యూట్రిషన్ కిట్లను అందిస్తుందన్నారు. గర్భిణులకు 14 వారాల నుంచి 26 వారాల వరకు ఆరోగ్య కేంద్రంలో, 27 నుంచి 34 వారాల వరకు అలంపూర్ ఆరోగ్య కేంద్రంలో న్యూట్రిషన్ కిట్లను అందిస్తారని పేర్కొన్నారు. మొత్తం 21 మంది లబ్ధిదారులకు న్యూట్రిషన్ కిట్లను అందించారు. గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది సత్యానారాయణ, చంద్రన్న, సంధ్యారాణి, తిరుమల్‌రావు, సోని, ఏఎన్‌ఎం షాజహాన్ తదితరులు పాల్గొన్నారు.

‘కంటి వెలుగు’పై ప్రత్యేక శ్రద్ధ



మాట్లాడుతున్న ఎంపీడీఓ రమణారావు

మానవపాడు: కంటి వెలుగుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటునట్లు ఎంపీడీఓ రమణారావు సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు, ఏఎన్‌ఎంలకు, ఆశావర్కర్లకు, అంగన్‌వాడీ టీచర్లకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి గ్రామంలో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కంటివెలుగును షెడ్యూల్ ప్రకారం నిర్వహించి విజయవంతం చేయాలని కోరారు. పంచాయతీలో ప్రతి ఒక్కరికి తెలిసేవిధంగా టామ్‌టామ్ వేయించాలని, మైక్‌లలో సమాచారం ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ అశోక్‌రెడ్డి, మెడికల్ ఆఫీసర్ రిజ్వానా తాన్విర్ డిప్యూటీ తహసీల్దార్ కరుణాకర్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు నిందితుల రిమాండ్

అలంపూర్: ట్రాక్టర్ దొంగతనంలో కేసులో ముగ్గురికి రిమాండ్ విధించినట్లు ఎస్‌ఐ శ్రీహరి తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాలు ప్రకారం మానవపాడు మండలం చెన్నిపాడు గ్రామస్తుడు శ్రీనుకు చెందిన ట్రాక్టర్‌ను ఈ నెల 5వ తేదీన ముగ్గురు వ్యక్తులు తీసుకెళ్లారు. రూ. 2 లక్షల అప్పు తిరిగి ఇవ్వకపోవడంతో వెంకట్రాముడు, పరుశురాముడు, లక్ష్మీనారాయణలు ట్రాక్టర్‌ను తీసుకెళ్లి పొలాల్లో దాచిపెట్టారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితులను సోమవారం జూనియర్ సివిల్ కోర్టులో హాజరుపరచారు. జడ్జి ముగ్గురికి రిమాండ్ విధించినట్లు పేర్కొన్నారు.

నేడు ముఖ్య కార్యకర్తల సమావేశం

కేటీదొడ్డి: మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహిస్తున్నట్లు గద్వాల కాంగ్రెస్ పార్టీ యువజన నియోజకవర్గ అధ్యక్షుడు రాజేంద్ర సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి జిల్లా అధ్యక్షుడు పటేల్ ప్రభాకర్ రెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు. మండల, గ్రామ కమిటీలను ఏర్పాటు చేసి ఈ నెల 26న హథ్ సే హథ్ జోడో అభియాన్ కార్యక్రమంపై అవగాహన కల్పిస్తారని వివరించారు.

బస్సు సౌకర్యం ఏర్పాటు



ఉండవెల్లి: మండలంలోని బస్వాపురం గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించడంతో సోమవారం గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు డీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. బస్సు ఏర్పాటుకు సహకరించిన బీఎస్పీ నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు మహేష్, ప్రభుదాస్, సుంకన్న, నాగేంద్రం, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో లక్ష్య సాధన సులువు



నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న నాయకులు

ధరూరు: క్రమశిక్షణతో లక్ష్య సాధన సులువు అవుతుందని నడిగడ్డ హక్కుల పోరాట సమితి మండల అధ్యక్షుడు గోవిందు అన్నారు. సోమవారం నెట్టెంపాడులో ఏర్పాటు చేసిన గ్రామ కమిటీ సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం 270 మంది విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. విద్యార్థులకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని సమితి సభ్యులు పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామిరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి రాము, గౌరవ అధ్యక్షుడు ఎల్లప్ప, గ్రామ అధ్యక్షుడు గుడిసె శివన్న, కోశాధికారి రాము, నాగేష్, నాయకులు మహాలింగప్ప, గోపాల్, ప్యాట్ల రాములు, లక్ష్మణ్, మల్లేష్, సూరి, దేవన్న, పాల్గొన్నారు.

వైఎస్‌ఆర్ పథకాలు ఆదర్శం



మాట్లాడుతున్న అతికూర్ రహ్మాన్

గద్వాల అర్బన్: దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు పేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచాయని వైఎస్సార్‌టీపీ అసెంబ్లీ కో ఆర్డినేటర్ అతికూర్ రహ్మాన్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మండల, పట్టణ, బూత్ స్థాయి కమిటీ, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్‌ఆర్ నిరుపేదల అభ్యున్నతి కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. ఉచిత కరెంటు, సబ్సిడీ రుణాలు, రుణమాఫీ, ఆరోగ్యశ్రీ, ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టారని గుర్తు చేశారు. రెండో విడత ఇంటింటికి కార్యక్రమంలో భాగంగా మంగళవారం గట్టు, మల్దకల్ మండలాల్లో వైఎస్‌ఆర్ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తామని పేర్కొన్నారు. సమావేశంలో ఆయా మండలాల అధ్యక్షులు నర్సన్న, సురేష్, శ్రీను, అంజి, ఇలియాస్, యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన



తక్కశిలలో భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ శివప్రసాద్, ప్రధానోపాధ్యాయులు

ఉండవెల్లి: మండలంలోని బైరాపురం, తక్కశిల గ్రామాలలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను సోమవారం ఎంఈఓ శివప్రసాద్ సందర్శించారు. బైరాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 5వ తరగతి విద్యార్థుల విద్యా నైపుణ్యం, మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని హెచ్‌ఎం సూచించారు. తక్కశిలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి పాఠశాలలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ, రాములు, పాల్గొన్నారు.

శివమాలధారులకు నిత్యాన్నదానం

జోగుళాంబ శక్తిపీఠం: అలంపురం పుణ్యక్షేత్రంలోని బ్రహ్మేశ్వర నిత్యాన్నదాన సత్రం వ్యవస్థాపకులు ప్రౌఢసరస్వతి గంద్రకోట కుమారశాస్త్రి ఆరాధన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఇక్కడికి వచ్చే భక్తులకు నిత్యాన్నదాన సత్రం ద్వారా ఉచిత భోజనాలు అందజేయాలనే ఉద్దేశంతో గంద్రకోట కుమారశాస్త్రి భిక్షాటన చేసి మరీ సంపాదించిన ఆస్తులతో నిత్యన్నదాన సత్రం కొనసాగుతుందని ఆలయ అర్చకులు తెలిపారు. సోమవారం బ్రహ్మేశ్వర నిత్యాన్నదాన సత్రంలో శివస్వాములకు తొలిరోజు 650 మందికి భోజనాలు అందజేసినట్లు ఆలయ ఈఓ పురేందర్‌కుమార్, చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

మానవపాడు: ఆధ్యాత్మికతతో ప్రశాంతత కలుగుతుందని పండితులు శ్రీకాంత్‌శర్మ అన్నారు. సోమవారం మండలంలోని అమరవాయిలో పలువురు శివ మండల దీక్షను స్వీకరించారు. ఈ సందర్భంగా శివాలయంలో శివనామస్మరణ మోర్మోగింది. కార్యక్రమంలో మాలధారులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆరాధన మహోత్సవాలు

రాజోళి: జోగుళాంబ గద్వాల జిల్లా మంగళవాయిద్య కళాకారుల సంఘం ఆధ్వర్యంలో త్యాగరాజ స్వామి ఆరాధన మహోత్సవాలు మంగళవారం నిర్వహించనున్నట్లు నాయీ బ్రాహ్మణ సేవా సంఘం మండల అధ్యక్షుడు పి.రాజు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్వామి వారి 7వ ఆరాధన మహోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలో పలు కార్యక్రమాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఉదయం వైకుంఠ నారాయణ స్వామి ఆలయం నుంచి స్వామి వారి ఊరేగింపు, మంగళవాయిద్యాల బృందాలచే కచేరి, ఫోక్‌సాంగ్స్ తదితర బ్యాండ్ మేళం బృందాల ప్రదర్శన ఉంటుందని తెలిపారు. మంగళవారం ఉదయం 11 గంటల నుంచి బుధవారం ఉదయం వరకు కార్యక్రమాలు కొనసాగుతాయని వివరించారు. ముఖ్య అతిథిగా అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహం, జెడ్పీ చైర్‌పర్సన్ సరిత లు హాజరవుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో డి.లక్ష్మన్న,పెద్ద దస్తగిరి, సుధాకర్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

పత్తి విత్తనాలు సరఫరా చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న నడిగడ్డ హక్కుల పోరాట సమితి నాయకులు

మల్దకల్: విత్తన పత్తి కంపెనీ యజమానులు రైతులకు నేరుగా విత్తనాలను అందించి వారు పండించిన పంటను నేరుగా కంపెనీలు తీసుకోవాలని నడిగడ్డ హక్కుల పోరాట సమితి మండల నాయకులు విష్ణు అధికారులను కోరారు. సోమవారం మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయం వద్ద విత్తన రైతులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీడ్ ఆర్గనైజర్లు సీడ్ పత్తి విత్తనాలను రైతులకు అందించి వారు పండించిన పంటను దోచుకుంటున్నారని వారు ఆరోపించారు. కంపెనీ నిర్వాహకులు రైతులకు నేరుగా విత్తనాలను సరఫరా చేసి వారిని ఆదుకుని న్యాయం చేయాలని వారు కోరారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రంను ఏఓ రాజశేఖర్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో నడిగడ్డ హక్కుల పోరాట సమితి నాయకులు ప్రేమ్‌రాజు, నదీముల్లా, కృష్ణ, గోపాల్, లక్ష్మన్న, ఆంజనేయులు, రాముడు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్దాం



మాట్లాడుతున్న మహిళా మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మాలతి

గద్వాల: ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్దామని బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు డాక్టర్ మాలతి అన్నారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మహిళా మోర్చా నాయకుల సమావేశంలో ఆమె మాట్లాడారు. సీఎం కేసీఆర్ పాలనపై అన్ని వర్గాల్లో అసంతృప్తి నెలకొందన్నారు. రాష్ట్రం పూర్తిగా అప్పుల పాలవుతోందన్న విషయాన్ని అందరూ గుర్తించాలన్నారు. టీఆర్‌ఎస్ అవినీతి, అక్రమాలు, వైఫల్యాలను క్షేత్రస్థాయికి తీసుకెళ్లాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో బీజేపీకి అనుకూల పవనాలు వీస్తున్నాయని, రానున్నది తమ ప్రభుత్వమేనని చెప్పారు. రాష్ట్రాభివృద్ధిలో కేంద్రం ఇచ్చిన నిధులే ఎక్కువగా ఉన్నాయన్నారు. కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం ఎన్నో అభివృద్ధి సంక్షేమ పథకాలతో దేశ ప్రజల మన్ననలు పొందారన్నారు. తెలంగాణలో అధికారమే లక్ష్యంగా పార్టీ కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గడ్డం కృష్ణారెడ్డి, మహిళా మోర్చా నాయకులు కృష్ణవేణి, బండల పద్మావతి, జయశ్రీ, అనిత, సమత తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం కోటా తగ్గించొద్దు



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

అలంపూర్: పేద ప్రజలకు అందిస్తున్న రేషన్ బియ్యం కోటా తగ్గించొద్దని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రేపల్లె దేవదాసు కోరారు. కేంద్ర ప్రభుత్వం రేషన్ కోటా తగ్గించకుండా యథావిధిగా కొనసాగించాలని వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సుభాష్ నాయుడుకు వినతి పత్రం అందజేశారు. కేంద్ర ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా ప్రతి నెల 6 కేజీలు అందిస్తోందని కానీ ప్రస్తుతం 5 కేజీలకు తగ్గించిందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం రేషన్ కోటాను తగ్గిస్తే రాష్ట్ర ప్రభుత్వం కలిపి ఇవ్వాలన్నారు. రేషన్ మార్పులకు సంబంధించి వెబ్‌సైట్‌ను తిరిగి పునరుద్ధరించాలని కోరారు. వీరితోపాటు వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు తదితరులు ఉన్నారు.

ఉద్యోగులకు బదిలీలు సహజం

గద్వాల అర్బన్: ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సహజమని మైనార్టీ ఎంప్లాయిస్ సర్వీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ కలీమ్ అన్నారు. జిల్లా ట్రెజరీ కార్యాలయంలో ఉప కోశాధికారిగా విధులు నిర్వర్తిస్తున్న హఫీజ్ వనపర్తికి బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర మైనార్టీ ఎంప్లాయీస్ సర్వీస్ అసోసియేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ట్రెజరీ కార్యాలయంలో ఉద్యోగి హఫీజ్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి హనీఫ్, అజ్మతుల్లా, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఫరీద్దుదీన్, జాయింట్ సెక్రటరీ నయీమ్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.


ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

ఆత్మకూర్: రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపడుతున్నాయని, విద్యార్థులు ప్రైవేట్‌కు దీటుగా రాణించాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు, వీజేఆర్ ఫౌండేషన్ అధినేత వర్కటం జగన్నాథ్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని గుంటిపల్లి ప్రభుత్వ పాఠశాలను వర్కటం జగన్నాథ్ రెడ్డి సందర్శించారు. పాఠశాలకు మౌలిక సదుపాయలు కల్పించడంతో పాటు విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేందుకు రూ.45వేలు విలువ చేసే స్మార్ట్ టీవీని అందించారు.

పడితే పాతాళానికే..

– ప్రమాదకరంగా మెట్లు

జోగుళాంబ శక్తిపీఠం: బాలబ్రహ్మేశ్వర ఆలయం ముందు నదిలోకి దిగే మెట్లు శిథిలావస్థకు చేరాయి. జనవరి 26వ తేదీ వసంత పంచమి సందర్భంగా నదిలో కోట పైన వెలసిన జోగులాంబ అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద ఎత్తున వందలాది సంఖ్యలో అక్కడికి చేరుకుంటారు. అయితే ప్రస్తుతం దిగడానికి కూడా వీలు లేకుండా పోయింది. మెట్లు ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి మెట్లకు మరమ్మతులు చేయాలని జోగులాంబ సేవా సమితి బాధ్యులు శ్రీనివాస్, వెంకన్నబాబు,ఆనంద్, సంజీవ నాయుడు పేర్కొన్నారు. ప్రమాదాలు చోటుచేసుకోకముందే చర్యలు తీసుకోవాలని కోరారు.



శిథిలావస్థకు చేరిన మెట్లు